# పతివ్రత

ఇక ఈశేషజీవితంలో ఎన్నడూ కథలు వ్రాయనని నేను ప్రతి
జ్ఞ చెయ్యలేదుగాని, సాధ్యమయినంత వరకు వ్రాయడం మానే
య్యాలని మాత్రం అనుకున్నాను!.... నేను కథలు వ్రాయడం
మానేస్తే, ఈలోకంలో ఎవ్వరూ ఏమీ నష్టపోరనే సత్యాన్ని చాలా
యేళ్ళక్రితమే గ్రహించేను. అయినా కీర్తికండూతి నన్ను అంత
తేలిగ్గా వదిలిపెట్టక పోవడంవల్ల, నానా విషయాలు వ్రాసి,
సుమారు పాతికేళ్ళపాటు అనేక పత్రికలద్వారా పాఠకులకంద
జేసేను!.... అంతా సుమారు అయిదారేళ్ళనుండి నేనేంవ్రాసి
పంపినా, పత్రికా సంపాదకులు తిరగ్గొట్టేస్తున్నారు!........నేటి
పాఠకులలో అధిక సంఖ్యాకులకు, ఏరకం కథలుకావాలో పసి
గట్టి, వారికి కావలసినరీతిలో కథలువ్రాయగలిగే శక్తి సామ
ర్థ్యాలు నాకు లేవని గ్రహించి — ఇహ కథలువ్రాయడం
మానెయ్యాలనుకున్నాను.

కాని నాయీ అభిమతానికి సరస్వతి అడ్డుతగిలింది! సరస్వతి
నాభార్య పార్వతికి చిన్ననాటి స్నేహితురాలు. మూడుసార్లు
మెట్రిక్యులేషన్ పోవడంతో నాభార్యచదువు చాలించేసింది!....
సరస్వతిమాత్రం బి.ఎ. పాసయింది!

సరస్వతి బి.ఎ. పాసయినందుకు నాభార్య ఈర్ష్యపడలేదు.
పైగా ఎంతో సంతోషించింది!

కాని నన్ను పెళ్ళాడినందుకు, పార్వతి లోలోన బాధపడు
తున్నాదేమోనని నా అనుమానం!.... నాకిటాంటి అనుమానం

కలగడానికి కారణం; సమయం దొరికినప్పుడల్లా ఆమె నన్నే వేవో కించపరచే మాటలంటూండడం!....

సరస్వతినికూడా ఆమె తల్లిదండ్రులు, నాబోటి ఓ బీద బడి పంతులికి కట్టబెట్టుంటే — నాభార్య పార్వతి నన్నో అప్రియో జకుడిగా భావించుండకపోయేదేమో !

సరస్వతి భర్త ఓలీడింగ్‌లాయరు! ... బాగా సంపాదిస్తున్నాడు డబ్బు!.... సకల ఆధునిక సౌకర్యాలతోను నిర్మించబడ్డ ఓ పెద్ద భవంతి, ఓకారు, ఓస్కూటరు, ఓసినిమా థియేటర్, భూములు, తోటలు, బ్యాంక్ ఎకౌంట్సు... ఇటువంటి వన్నీ బయటకగు పించే అతని ఆస్తిపాస్తులు!.... బ్లాక్‌మనీ ఎంతుందో మరి!!....

సరస్వతి ఎంతో అదృష్టవంతురాలని, తనెంతోదురదృష్టవంతు రాలని నాభార్య అభిప్రాయం !

అందుకనే నేనంటే నాభార్యకు చాలా నిరసనభావ మేర్ప డింది. నాభార్య ఎత్తిపొడుపు మాటలకు, అసహనానికి క్రమ క్రమంగా అలవాటుపడిపోయేను నేను !

నా సహనాన్ని భార్యావిధేయతగా భావించేవాళ్ళసంఖ్య అల్పమైన దేంకాదు!.... భార్యావిధేయులగు భర్తల్ని, "హెన్ పెక్‌డ్ హజ్‌బెండ్సు" గా గేలిచెయ్యడం నేటి సభ్య సమాజంలో ఒకసాధారణమైన విషయం! కాని పతికి విధేయులగు భార్యల్ని మాత్రం, "పతివ్రత" లని కీర్తిస్తూంటారు!

అట్లా కీర్తింపబడుతున్న పతివ్రతలలో సరస్వతి ఒకతె!

అవాళ సరస్వతి మాయింటికి వచ్చి, "పార్వతివుందా?" అనడిగింది నన్ను.

"లేదు!" అని సమాధాన మిచ్చేను. ఇంట్లో పార్వతి లేదు గనుక, ఆమె వెంటనే వెళ్ళిపోతుందనుకున్నాను!

కాని బెంచీమీద కూర్చుంటూ, "ఎక్కడికెళ్ళింది?" అనడిగింది

"తీర్థయాత్రిలకెళ్ళింది?" అని సమాధానమిచ్చేను.

"మాష్టారూ!.... చాలాకాలంనుండి మీకథలేఁవీ ఏపత్రిక లలోను కనిపించడంలేదు. వ్రాయడంలేదా?" అనడిగింది.

"ఈమధ్య వ్రాయడంలేదు. ఆమధ్య వ్రాసిపంపిన కొన్ని కథల్ని ప్రచురణార్హతలేనివిగా భావించి, త్రిప్పి పంపేశారు కొంతమంది పత్రికాధిపతులు."

సరస్వతి ఎంతో ఆశ్చర్యంతో, "మీకథల్ని త్రిప్పిపంపే శారా?!" అనడిగింది

"అవును. నేటిపాఠకులలో అధికసంఖ్యాకులు మెచ్చేవిధంగా వ్రాయలేకపోతున్నాను" అని సమాధానమిచ్చేను

సరస్వతి కొద్దిక్షణాలసేపు మౌనంగావూరుకొని, ఓసారి భారంగా నిట్టూర్చి, "మాష్టారూ!... నన్ను ప్రధాన పాత్రను చేసి మీరొక కథవ్రాయకూడదూ?" అనడిగింది.

ఆమె అట్లా అడిగేసరికి నేనెంతో ఆశ్చర్యపోయేను!........ ఇదేఁవిటి?.... తనగురించి కథవ్రాయమంటుందేఁవిటి? ఈమె గురించి వ్రాయడానికి అసలు కథంటూ ఒకటుందా?.... అనే ఆలోచనలోపడ్డాను.

"ఏఁవిటి మాష్టారూ ఆలోచిస్తున్నారు?.... నన్ను గురించి వ్రాయడానికి కథంటూ ఏదైనా ఒకటుండాలనా?" అనడిగింది.

అప్రయత్నంగా నానోటివెంబడి, "వూఁ!" అనే మూలుగు నీరసంగా వెలువడింది.

"నాకు మీవంటివారు భర్తగాలభించుంటే, ఎంతో బాగుండేది! .. నేనిప్పుడు యింకేఁవీ చెప్పలేను!" అని రుద్ధకంఠంతో గొణిగి గబగబా వెళ్లిపోయిందామె.

నేను నిర్ఘాంతబోయేను !

అట్లా అనడంలో ఆమె ఉద్దేశ్యం ఏమయివుంటుందా అని ఆలోచిస్తూ వాలుకుర్చీలో వెనక్కు చేరబడ్డాను.

సరస్వతికి ఇప్పుడేంలోటు?.... ఆమె భర్త మాప్రాంతంలో గొప్ప అడ్వకేట్!.... ధనానికి, పలుకుబడికి, హోదాకు లోటు లేదు. వండిపెట్టడానికి యింట్లోవంటమనిషుంది. పాచిపనులు చెయ్యడానికి పనిమనుషులున్నారు. విందులకు వినోదాలకు లోటులేదు!.... ఒకే ఒక్క కొడుకు. ప్రస్తుతం అమెరికా సంయుక్తరాష్ట్రాలలో ఓ వైద్యుడిగా సెటలయేడు !.... నిజానికి ఆమెకేలోటూ లేదనే నాభావన !.... ....

....నిజంచెప్పాలంటే నాజీవితాన్ని ఓ కథగా వ్రాసుకోవచ్చు!

నాపెద్దకూతురు ఎట్లా అయితేనేం మెట్రిక్యులేషన్ పాసయింది! దానికి పెళ్లిచెయ్యగలిగే శక్తి నాకులేదని నాకన్నా దానికే బాగాతెలుసు!.... అందుకనే ఓపెద్దషాపులో సేల్సుగర్లుగా కుదురుకుంది!

ఇకపోతే నారెండోకూతురు, నాపెద్ద కూతురుకన్నా తెలివైనది !.... నేనెంతటి అప్రయోజకుడినో, అసమర్థుడినో

గ్రహించి తనదారి తాను చూసుకుంది. ఓ గొప్ప స్మగ్లర్ గా ప్రఖ్యాతిగాంచినవాడి కొడుకుని పెళ్ళాడేసింది !.... వాడికి డబ్బుకి లోటు లేదు !.... ఉన్నలోటల్లా అంధత్వం!.... గ్రుడ్డి వాడయితేనేం?.... డబ్బున్నవాడు!.... డబ్బుతో ఆనందాన్ని, సుఖాల్ని కొనుక్కోవచ్చు!.... దానికి కావలసినవవే! ....వాటి కోసం అది ఎంతోవాచిపోయింది. అందుకనే అంధుడ్ని పెళ్ళా డేసింది. అతగాడి డబ్బుతో, అది అంచక్కా తన ముచ్చటల్ని తీర్చుకొంటోంది!

ఇకపోతే తన మూడోకూతురికి చిన్నప్పుడే పోలియోవ్యాధి వచ్చి అవిటిదయిపోయింది. ఎడంచేతోనే అన్నిపనులూ బాగా చెయ్యగలుగుతోంది ! .... చిన్నచిన్న కథలు వ్రాస్తోంది. భవిష్యత్తులో ఉత్తమరచయిత్రిగా కీర్తి ప్రతిష్ఠల్ని ఆర్జించుకో గలదేమోనని నాఆశ !

నాలుగో సంతానం, అయిదో సంతానం కొడుకులు !.... పున్నామనరకంనుండి మాకు విముక్తిని లభింపజేసే వంశోద్ధా రకులు వాళ్ళు!... అయితే వాళ్ళ ఆయుర్దాయంగురించే నాకు అనుమానం !

నాభార్య పార్వతికి నాలోకనిపించని ఏప్రత్యేకత, సరస్వ తికి నాలో కనిపిస్తోంది?

ఒక కథారచయితగా కొన్నేళ్ళక్రితం వరకు, నాకు తెలుగు పాఠకలోకంలో కించిత్ గుర్తింపు వుండేది!....ఇప్పుడదికూడా లేదు ! ...

మరి సరస్వతి ఎందుకలా అంది?.... ఎంతసేపాలోచించినా నాకు సమర్థనీయమైన సమాధానం స్ఫురించలేదు !

ఆమెనే అడిగితే ?....

ఒకవేళ ఆమెభర్త ఆమె నీమధ్య నవ్యంగా చూడలేదా?.... అట్లా భావించేటందుకవకాశాలు చాలా తక్కువ! ఎంచేతంటే భార్యని హింసించే స్వభావంకలవాడిగా వూళ్లో ఎవ్వరూ అతడిని వేలెత్తి యింతవరకు చూపలేదు !

అయితే ఒకటి !.... ఆమె భర్త యీప్రాంతంలో సాంఘికంగా గొప్ప పలుకుబడి కలవాడు కనుక — క్లబ్బులు, విందులు, వినోదాలు .... యిట్లాంటి నవీన నాగరికతా చిహ్నాల యినసరదాలలో పాలొనకుండా తప్పించుకోలేకపోతున్నాడు

ఏది ఏమైనా లాయర్ రావ్, భార్యని చిత్రహింసలపాలు చేసేటంతటి దుర్మార్గుడుకాడని నావిశ్వాసం !

లాయర్ రావ్ యొక్క జీవితంతో సరిపోల్చిచూస్తే, నా జీవితం తేజోవిహీనమయినది !— నాకు తెలిసినంతవరకు యితరుల్ని; ముఖ్యంగా స్త్రీలను ఆకర్షించగలిగే ప్రత్యేక లక్షణాలేవీ నాలోలేవు! — ఈ సత్యాన్ని, నాభార్య నాపట్ల వ్యవహరించే తీరునిబట్టి చాలాకాలంక్రితమే నేను గ్రహించేను!

మరి నాలోగల ఏప్రత్యేకత సరస్వతిని ఆకర్షించిందో నాకవగతం కాలేదు !—

"నాకు మీవంటివారు భర్తగా లభించుంటే ఎంతో బాగుండేది!" అని సరస్వతి అనడంలోగల అంతర్యం ఏమిటి?—

ఆమెనే అడిగితేనో ?— చెప్తుందా ?—

ఒకరోజున సరస్వతి మా యింటికి వచ్చి "పార్వతి వచ్చిందా?" అనడిగింది.

"ఇంకా రాలేదు." అని సమాధానమిచ్చేను.

"అది సరేగాని, నాకథ వ్రాసేరా?" అనడిగింది.

"లేదు."

"ఏం? — ఎంచేత ?"

"ఏం వ్రాయాలో తెలియకపోడం వల్ల !"

"భర్త నేటి సమాజంలో ఎంత ఉన్నతస్థాయిలోవున్నా, ఇతరులచే ఎంతగా మన్ననలు పొందుతున్నా, భార్యను హింసించకపోయినా;— అతడొక త్రాగుబోతు, జూదగాడు, వ్యభిచారి, అవినీతిపరుడు అయి; నైతికంగా పతనమయిపోతున్నప్పుడు, అతనిభార్యపొందే మానసికవ్యధను విశ్లేషించి ఓకథ వ్రాయలేరా ?— భర్త దరిద్రుడైనా పరమపవిత్రుడైనట్లయితే — ఆ దారిద్ర్యాన్ని ఎంతో సంతోషంగా అనుభవించగలిగే స్త్రీ హృదయాన్ని అవగతంచేసుకొని ఓ కథ వ్రాయలేరా?" అనడిగిందామె రుద్ధకంఠంతో.

ఆమెకేమని సమాధానమివ్వడమో బోధపడక మౌనం వహించేను.

"నాకుతెల్సు; మీరీయితివృత్తాన్ని ఆధారంగా చేసుకొని ఓమంచి కథవ్రాయగలరని!— మీరీకథకు, నేనాశించిన విధంగా మంచి ముగింపునివ్వగలరని భావిస్తున్నాను!" అని కొంచెంసేపాగి, గొంతుక సవరించుకొని, "అన్నట్లు చెప్పడం మరచేను. నేను రేపు తీర్థయాత్రలకు బయలుదేరాలనుకుంటున్నాను!" అనిచెప్పి వెళ్లిపోయిందామె.

కథ వ్రాయడమంటూ జరిగితే; అప్పుడాకథ నెట్లాముగించడమో ఆలోచించవచ్చనుకున్నాను.

* * *

తీర్థయాత్రల్ని ముగించుకొని, పుణ్యాన్ని మూటగట్టుకొని నాభార్య పార్వతి అవాళ యింటికొచ్చేసింది.

అదేరోజున పోష్టుమాన్ ఓ టెలిగ్రాం అందజేసేడు. అందులోని సారాంశం ఏమిటీ అంటే; నామూడో కుమార్తె అరుణ. అంటే పోలియోవ్యాధికి గురై అవిటిదయిపోయినది - కథల పోటీకిపంపిన కథకు ప్రథమబహుమతి రెండువేలరూపాయిలు వచ్చినట్లూ - వెంటనే జీవిత విశేషాలతోపాటు ఓ ఫోటో పంపమని !....

"ఏమమ్మా అరుణా!—నువ్వు పోటీకి పంపిన "పతివ్రత" అను కథకు ప్రథమ బహుమతివచ్చిందమ్మా," అని ఎంతో ఆనందంతో ఆటెలిగ్రామ్‌ను అరుణచేతికిచ్చి, "ఆకథ చిత్తు ప్రతి నీదగ్గరున్నట్లయితే, ఓసారి నాకియ్యమ్మా చదువుతాను." అని అన్నాను.

చిత్తుప్రతి తీసుకొచ్చి నాచేతికిచ్చింది అరుణ.

చదివేనాకథను !

నన్ను ఏకథవ్రాయమని పర్వతి కోరిందో అదే కథను అరుణ వ్రాసింది !!....

అయితే అరుణ వ్రాసిన కథలోని "పతివ్రత" తన భర్త యొక్క నైతికపతనాన్నిగాంచి, తీవ్రంగా అసహ్యంచుకొని తీర్థయాత్రలకెళ్లిపోతుంది !.... అట్లా తీర్థయాత్రలకని వెళ్ళి నామె మరి తిరిగిరాదు ! !.... ఇదీ ఆకథకు అరుణ యిచ్చిన ముగింపు !!....

అరుణ వ్రాసిన కథకు రెండువేల రూపాయిలు బహుమతి

వచ్చినందుకు నాభార్య పార్వతి చాలా సంతోషించింది. కాని ఆకథ ముగింపుమాత్రం నాభార్యకు నచ్చలేదు.

"డబ్బు, పలుకుబడి, హోదా, దర్జా అన్నీ వున్న భర్తకి ఆ మాత్రం దురలవాట్లుంటే నష్టమేమిటి?.... ఏదో ఒక విధంగా సర్దుకుపోవాలి!.... భర్త ఎట్లాంటివాడైనా సర్దుకుపోగలిగేదే పతివ్రతనిపించుకుంటుంది!.... అనేక దురలవాట్లకులోనైన భర్తపై అసహ్యతను పెంచుకొని, తీర్థయాత్రలనే నెపంతో భర్తనొదిలేసి ఎటో వెళ్ళిపోడం పతివ్రతా లక్షణం కాదు!'' ఇదీ ఆకథపై నాభార్య విమర్శ.

సరస్వతి స్థానంలో పార్వతి - పార్వతిస్థానంలో సరస్వతి వుండుంటే ఈకథ ఎట్లా ముగిసుండేదో ఆలోచించగలిగే ఓపిక నాకిప్పుడు లేదు !

[ 1981 సంవత్సరం జూలైనెల "విజయ" మాసపత్రికలో ఈ కథ ప్రచురించబడింది. ]